మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

- వార్డుల సమగ్రాభివృద్ధికి కృషి
- మేయర్ హరి వెంకటకుమారి
- రూ.2.25 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


సాయినగర్ కాలనీలో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి, చందు


76వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఉరుకూటి చందు

పెదగంట్యాడ: నగరంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. వార్డుల సమగ్రాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. 76వ వార్డు పరిధి బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, నడుపూరు, భరత్ నగర్ ప్రాంతాల్లో రూ.2కోట్ల 25 లక్షల రూపాయలతో చేపట్టనున్న రోడ్లు, కాలువలు, కల్వర్టు, సామాజిక భవన నిర్మాణ పనులకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు)తో కలసి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర వాసులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా విశాఖ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్ పాలనలో ప్రజలు సంతృప్తికరంగా జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, నాయకులు దొడ్డి రమణ, మంత్రి శంకరనారాయణ, జి. పప్పి నాయుడు, సుదర్శన్, ఎండా కృష్ణ, ఎంకే ఎస్ మూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో..

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధిలోని అగనంపూడి, గౌరీనగర్‌లలో రూ.90లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బస్ బే నిర్మాణ పనులకు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో దాదాపు అన్ని రహదారులు పునర్నిర్మించామని, మరమ్మతులు పూర్తి చేశామని చెప్పారు. నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు మాట్లాడుతూ గాజువాక సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. ఏడాదిలో గణనీయమైన అభివృద్ధి సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

85వ వార్డులో..

85వ వార్డు అగనంపూడిలోని సాయినగర్ కాలనీలో రూ.20లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, నాయకులు ఇల్లపు ప్రసాద్, పెదిరెడ్ల హరీష్, యలమంచిలి అప్పారావు, ఎల్.వి.రమణ, బోర సోమునాయుడు, గెద్దాడ అప్పలరాజు, దాసరి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి..

స్థానిక సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక నాయకులు మేయర్‌కు వినతిపత్రం సమర్పించారు. అగనంపూడి హైవే నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ వరకు విద్యుద్దీకరణ చేపట్టాలని, అగనంపూడి టోల్‌ప్లాజా తొలగించాలని, తలారివానిపాలెం అండర్ పాత్ వంతెన నిర్మించాలని, నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, గళ్ల రాజు, బొబ్బరి సూర్యనారాయణ, సింగిడి సింహాచలం, గళ్ల గణపతి, లక్ష్మి ప్రసన్న తదితరులు వినతిపత్రాలు అందజేశారు.

రూ.20 లక్షలతో రోడ్డు నిర్మాణానికి ..

గాజువాక : జీవీఎంసీ 73వ వార్డు పైడిమాంబ కాలనీలోని కృష్ణుడి ఆలయం వద్ద సీసీ రోడ్, కల్వర్టు నిర్మాణానికి జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పించడానికి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, నాయకులు భూపతిరాజు శ్రీనివాసరాజు, ధర్మాల శ్రీను, ఈశ్వరరావు జగదీష్, తుంపాల శ్రీను, రాజు, మంజు, వరలక్ష్మి, గౌరి, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం


వుడా కాలనీలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

పెదగంట్యాడ: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక వినాయకనగర్ వుడా కాలనీలోని చైతన్య కళాశాలలో మొదటి రోజు నిర్వహించిన తెలుగు/హిందీ/ఉర్దూ/సంస్కృతం పరీక్షలకు మొత్తం 448 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 11 మంది గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ మురళీ కృష్ణ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచే కళాశాల వద్ద కోలాహలం నెలకొంది.

విద్యార్థులకు అభినందన

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన మెహరున్నీసా బేగం, డి.దిలీప్‌కుమార్‌లను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శనివారం తన కార్యాలయంలో అభినందించారు. మెహరున్నీసా బేగం ఇటీవల జరిగిన సౌత్‌వెస్ట్ జోన్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. దిలీప్‌కుమార్ ఎన్‌సీసీ తరపున 75వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరిని వీసీ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, విభాగాధిపతి ఆచార్య వి.వి.ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరసిద్ధి వినాయకునికి రజత పుష్పార్చన


గణనాథుడి పూజకు సిద్ధం చేసిన వెండి పుష్పాలు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-3 షాపింగ్ కాంప్లెక్స్‌లోని వరసిద్ధి వినాయకునికి శనివారం వెండి పుష్పాలతో సహస్ర పుష్పార్చన చేశారు. ఆలయ 18వ వార్షికోత్సవాల్లో భాగంగా ఉదయం వినాయకుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం రుత్వికుల ఆధ్వర్యంలో నిర్వహించిన పుష్పయాగంలో వివిధ రకాల పుష్పాలతో స్వామిని అర్చించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తిరుమల బాలాజీకి పుష్పార్చన


పుష్పరాశి మధ్య తిరుమల బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామివారికి శనివారం పుష్పార్చన నిర్వహించారు. బాలాజీ విశేష అలంకరణలో భక్తులకు కనువిందు చేశారు.

స్వామి సన్నిధిలో సినీనటుడు రవిప్రకాష్

సినీ నటుడు రవి ప్రకాష్ శనివారం స్వామిని దర్శించుకున్నారు.దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు, ఆలయ పండితులు ప్రవీణ్ రవి ప్రకాష్‌కు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు.

ఘనంగా మార్టుపూడి జన్మదిన వేడుకలు


పరదేశితో కేక్ కట్ చేయిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి జన్మదిన వేడుకలను టీఎన్నార్ ఫంక్షన్ హాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కేక్ కట్ చేయించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయ కులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, మహ్మద్ ఇమ్రాన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ ప్రతిష్టాపనోత్సవాలు

పెందుర్తి: మండలంలోని కోటిన్నివానిపాలెంలో నూతనంగా నిర్మించిన సంపత్ వినాయక పూర్వక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత కోదండ రామాలయ ప్రతిష్టాపనోత్సవాలు రెండు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. శిఖర యంత్ర మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ శిఖర యంత్రాలకు పూర్ణకలశాలతో భక్తులు జలాధివాసం చేశారు. ముందుగా గ్రామ వీధుల్లో మూలవిరాట్‌లు, శిఖర యంత్రాలను ఊరేగించారు. వందలాదిగా మహిళలు పూర్ణ కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం వేద మంత్రోచ్చరణల నడుమ మూలవిరాట్‌లకు జలాధివాసం, క్షీరాభిషేకం, పుష్పాభిషేకం జరిపారు. అగ్ని ప్రతిష్ట చేశారు. సాయంత్రం నుంచి విగ్రహాలకు ధాన్యధివాసం, అష్టదిక్‌బలి, పంచశయ్యాదివాసం జరిపి మంగళ హారతులిచ్చారు. యాగశాలలో హోమాలు జరిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు ఆదివారం ఉదయం 9.49 గంటలకు విగ్రహ, శిఖర ప్రతిష్ట చేయనున్నారు.

ఉత్సాహంగా ఉక్కు మహిళా ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్


విజేతలతో స్టీల్‌ప్లాంట్ సీజీఎంలు సోత్బీ, ప్రకాశ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మహిళా ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ రెండు రోజుల పాటు ఉత్సాహంగా జరిగింది. స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం, విమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ (విప్స్) సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కు స్టేడియంలో క్రికెట్, బ్యాడ్మింటన్, షాట్‌పుట్, జావెలిన్ త్రో తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎ.కె.సోత్బీ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో పోటీల్లో పాల్గోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ సీజీఎం డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్, ఏసీఎస్ విభాగాధిపతి వి.చిట్టిబాబు, విప్స్ కో-ఆర్డినేటర్ కె.ఎస్.చంద్రావతి, స్పోర్ట్స్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

కూచిపూడి పితామహుడి పేరిట స్మారక పురస్కారం

- సొంత నిధుల నుంచి విరాళం అందించిన ఆచార్య సరస్వతి విద్యార్థి


ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి విరాళం డీడీ అందిస్తున్న ఆచార్య సరస్వతి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం నృత్య విభాగంలో స్మారక బహుమతిని ఏర్పాటు చేశారు. విభాగ ఆచార్యురాలు కె.సరస్వతి విద్యార్థి తన సొంత నిధుల నుంచి రూ 1.5 లక్షలు విరాళంగా అందించి 'కూచిపూడి పితామహ శ్రీ సిద్ధేంద్రయోగి మెమోరియల్ ప్రైజ్' ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు శనివారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని ఆమె కలిసి ప్రైజ్ ఏర్పాటుకు అవసరమైన నిధులకు సంబంధించిన డీడీని అందించారు. విభాగంలో ఎంఏ డ్యాన్స్‌లో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి ఈ ప్రైజ్ ఇవ్వాలని సరస్వతి కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ శక్తులకు బీజేపీ ఊడిగం'


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1115వ రోజు, శనివారం సంస్థలోని వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమంపై ప్రభుత్వ అణచివేత పెరుగుతున్న కొద్దీ ప్రజల్లో వ్యతిరేకత పెరిగి బీజేపీ రాజకీయ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ అంశంగా మలచే దిశగా కార్మికవర్గం అడుగులు వేయాలన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ నినాదంతో నేడు దీక్షా శిబిరం నుంచి నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు జరగనున్న పాదయాత్ర కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల సంక్షేమం


పాదయాత్ర నిర్వహిస్తున్న చందు


పథకాలను వివరిస్తున్న చందు

గాజువాక : ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలతో పాటు మరిన్ని పథకాలు అమలు కావడం కోసం ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి రావాలని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. 71వ వార్డు దత్తసాయి నగర్‌లో శనివారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు, రాష్ట్రానికి మంచి భవిష్యత్తును అందించేందుకు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కాగా, పాదయాత్ర నిర్వహిస్తున్న చందుకు వార్డులోని మహిళలు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు రెడ్డి జగన్నాథం, కె.అప్పలాచారి, మొల్లి శేషు, డి.రాము, బ్యాంక్ ప్రసాద్, కటికల కల్పన, వెంకటేష్, రమేష్, ప్రభాకర్, దేవుడు, కొణతాల రాము, చంటి, రాజ వరలక్ష్మి, బి.జనార్దన్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో అన్న సమారాధన


భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న దొడ్డి రమణ, మంత్రి మంజుల తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. మనోజ్‌కుమార్ రెడ్డి, మనీషారెడ్డి ఆర్థిక సాయంతో ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు దొడ్డి రమణ ప్రారంభించారు. కార్యక్రమంలో వై.అప్పలనాయుడు, పెంటకోట రాజు, పండూరి రామారావు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు


పెదగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయవద్దని కోరుతూ అఖిలపక్ష సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు నిర్వహించనున్న మహా పాదయాత్రను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు గంగవరం పోర్టు వంతెన వద్ద శనివారం ఆందోళన చేశారు. పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. పులి రమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు, శ్రీనివాసరావు, నమ్మి అప్పారావు, కణితి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు రాజకీయ పార్టీల మద్దతు

ఉక్కునగరం: మహా పాదయాత్రకు వివిధ రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. ఈ మేరకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, జనసేన నాయకుడు కోన తాతారావు పరిరక్షణ కమిటీకి లేఖలు అందజేశారు. గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి పంపిన లేఖలో తమ పార్టీ ఉక్కు ఉద్యమానికి పూర్తి మద్దతు ఇస్తోందని, పాదయాత్రలో పాల్గొని కార్మికుల పక్షాన మద్దతు ఇస్తానని తెలియజేశారు.

చుక్కల మందుకు సర్వం సిద్ధం


దేవాడ పీహెచ్‌సీలో పల్స్ పోలియో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా


పల్స్ పోలియో కార్యక్రమానికి సిద్ధమైన అంగన్‌వాడీ కేంద్రం


గాజువాక పీహెచ్‌సీలో సిద్ధం చేసిన వ్యాక్సిన్ బాక్సులు

గాజువాక : ఈ ఏడాది పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గాజువాక నియోజకవర్గంలోని మూడు పీహెచ్‌సీలతో పాటు యూపీహెచ్‌సీల పరిధిలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ చుక్కలను వేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీనికి సంబంధించిన సామగ్రి ఆయా కేంద్రాలకు చేరింది. అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిధిలోని సచివాలయాలు, అంగన్‌వాడీ, సామాజిక భవనాల వద్ద ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఏదైనా కారణాల వల్ల ఆదివారం ఈ పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారుల కోసం ఏఎన్‌ఎం, ఆశ వర్కర్, అంగన్‌వాడీ, వలంటీర్లు, ఇతర కార్యకర్తలతో కూడిన బృందం 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేస్తుందని అధికారులు తెలిపారు.

గాజువాక పీహెచ్‌సీలో సన్నద్ధం

గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 3791 మంది బాలలకు చుక్కల మందు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దానికోసం 22 కేంద్రాలతో పాటు రెండు ట్రాన్సిట్ కేంద్రాలు, ఒక సంచార బృందాన్ని ఏర్పాటు చేశారు. చుక్కల మందు వేయడానికి 96 మంది వ్యాక్సినేటర్లను నియమించారు. వారికి మూడు రోజుల క్రితమే శిక్షణ కార్యక్రమం కూడా పూర్తి చేశారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు వయస్సుగల చిన్నారులందరికీ ఈ మందు అందించనున్నారు. మొదటిరోజే లక్ష్యాలను సాధించే విధంగా పీహెచ్‌సీలో ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలిరోజు చుక్కలమందు వేయించుకోని చిన్నారులకు ఇంటింటికీ వెళ్లి మందు వేయడం కోసం 23 బృందాలను సిద్ధం చేశారు. మొత్తం 2 రూట్లను ఏర్పాటు చేసి ప్రతి రూట్‌కు ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. పీహెచ్‌సీకి చెందిన 11 సచివాలయాల పరిధిలోని 11 గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగనుంది. దీనికోసం 225 వయల్స్‌తో చుక్కలమందును సిద్ధం చేసినట్టు గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్ తెలిపారు. వ్యాక్సిన్ వాయిల్ మోనిటర్ ద్వారా వ్యాక్సిన్ నాణ్యతను పరిశీలిస్తామన్నారు. ప్రయాణంలో ఉన్నవారికి చినగంట్యాడ, అనకాపల్లి బస్ స్టాప్‌లో టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. పిల్లలకు జ్వరం, విరేచనాలు, ఇతర చిన్నచిన్న రుగ్మతలు ఉన్నా పల్స్ పోలియో చుక్కలు వేయించవచ్చని, చుక్కల మందు వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని పేర్కొన్నారు.

దేవాడ పీహెచ్‌సీ పరిధిలో..

పెదగంట్యాడ: పోలియో మహమ్మారిని దేశం నుంచి తరిమి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా పిలుపునిచ్చారు. దేవాడ పీహెచ్‌సీ పరిధిలో ఈ నెల 3న ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. దేవాడ పీహెచ్‌సీ ఆవరణలో పల్స్ పోలియో పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు విధిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఎవరికి వారు తమ పిల్లలను సమీపంలోని కేంద్రాలకు తీసుకెళ్లి చుక్కలు వేయించాలని కోరారు. జీవీఎంసీ 77వ వార్డు దేవాడ పీహెచ్‌సీ, నమ్మిదొడ్డి యూపీహెచ్‌సీ పరిధిలో మొత్తం 25 కేంద్రాల ద్వారా 1540 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నామని తెలిపారు. పసిపిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ద్వారకా తిరుమలలో చోరీ

- గాజువాకకు చెందిన భక్తుడి కారులోని బంగారు వస్తువుల మాయం


బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న ద్వారకా తిరుమల ఎస్ఐ సతీష్

ద్వారకాతిరుమల: శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి విచ్చేసిన ఒక దంపతులు తమ వద్ద ఉన్న 17 కాసుల బంగారు నగలను కారులో ఉంచి, స్వామివారి దర్శనానికి వెళ్లి, తిరిగి వచ్చేసరికి ఆ బంగారు నగలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన శనివారం ఉదయం కొండపైన సెంట్రల్ పార్కింగ్‌లో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం విశాఖపట్నం జిల్లా పాత గాజువాక లోని సమతా నగర్‌కు చెందిన కిరీటం సత్య భాస్కరరావు, కొత్త అన్నపూర్ణ విశాలాక్షి దంపతులు రావులపాలెంలోని ఒక వివాహ వేడుకకు హాజరై, అక్కడి నుంచి నేరుగా ఉదయం తమ కారులో శ్రీవారి దర్శనార్థం ద్వారకాతిరుమల క్షేత్రానికి వచ్చారు. తమ వద్ద ఉన్న 17 కాసుల 02 గ్రాముల బరువైన రాళ్ల పొదిగిన రెండు జతల బంగారు చెవి దిద్దులు, రాళ్ల పొదిగిన నాలుగు బంగారు గాజులు, నాలుగు పేటల బంగారు పరకసరల గొలుసు, రాళ్ల పొదిగిన బంగారు నెక్లెస్, ఒక బంగారు హారాన్ని పర్సులో పెట్టి దాన్ని తమ కారు సీటు కింద పెట్టారు. ఆ కారును సెంట్రల్ పార్కింగ్‌లో పార్క్ చేసి దర్శనానికి వెళ్లారు. మధ్యాహ్నం సుమారు ఒంటిగంటన్నర సమయంలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యేందుకు కారు ఎక్కిన బాధిత దంపతులకు బంగారు వస్తువులు పెట్టిన పర్సు కనిపించలేదు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. భీమడోలు సీఐ భీమేశ్వర రవికుమార్, ద్వారకా తిరుమల ఎస్ఐ జి.సతీష్ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం దేవస్థానం సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. బాధితురాలు కొత్త అన్నపూర్ణ విశాలాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.